# ప్రజలకు భూభారతి చట్టంపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తాం

## సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి




**గజ్వేల్, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**
: భూ భారతితో పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తుందని, భూ సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం ఐవోసీ సమావేశ మందిరంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ముందుగా భూభారతి చట్టంలోని వివిధ అంశాలను అదనపు కలెక్టర్ రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డులాగా భూమికి భూధార్ సంఖ్య కేటాయింపు ప్రణాళికను తీసుకొస్తుందన్నారు. దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చున్నారు. గ్రామాల్లోని ప్రజలకు భూభారతి చట్టంపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తామన్నారు.

భూ సమస్యలపై అధికారులు అందించే ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) నిర్ణయంపై ఏమైనా అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, మండల ప్రత్యేకా ధికారి సువర్ణ, తహసీల్దార్ శ్రవణ్, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

# దత్తగిరిలో మహా రుద్రయాగం ప్రారంభం

**ఝరాసంగం, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**



దేశాన్ని పట్టి పీడిస్తున్న దుష్ట శక్తుల నుండి విముక్తి కలిగించాలని కోరుతూ మహా రుద్రయాగాన్ని ప్రారంభించినట్లు దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ డాక్టర్ 1008 సిద్దేశ్వరానందగిరి మహారాజ్, వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ తెలిపారు. సోమవారం వేద మంత్రోచ్చారణల మధ్య వైదిక పాఠశాల విద్యార్థులు ఈ మహా రుద్రయాగ క్రతువును ప్రారంభించారు. గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, అనంతరం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన యాగం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతితో ముగిసింది. ప్రతీ రోజు యజ్ఞం నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. దేశానికి దుష్ట శక్తుల నుండి విముక్తి లభించే వరకు రుద్ర యజ్ఞం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగంఎస్సై నరేష్‌పాల్గొని పూర్ణాహుతి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

# బాల బాలికలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

**మెదక్ , ఏప్రిల్ 28 సిరి న్యూస్:**



తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం మెదక్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 10 గ్రామీణ ప్రాంతాల్లో 14 సంవత్సరాలలోపు బాల బాలికలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా యువజన క్రీడాల అధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. మే 1వ తేదీనుంచి జూన్ 6వ తేది వరకు కొనసాగించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

శిక్షణ నిమిత్తం సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అనుభవజ్ఞులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. శిక్షకుడికి రూ.5 వేల పారితోషికంతోపాటు క్రీడా సామాగ్రి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ శిబిరాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించే ప్రాంతాలివే..

1. జడ్పీహెచ్ఎస్ ప్రగతి ధర్మారం, రామాయంపేట మండలం
2. మోడల్ స్కూల్, చేగుంట
3. తెలంగాణ క్రీడా ప్రాంగణం, మనోహరబాద్
4. జడ్పీహెచ్ఎస్ ముస్లాపూర్, అల్లాదుర్గం మండలం
5. జడ్పీహెచ్ఎస్ మదూర్, చిన్న శంకరంపేట
6. జడ్పీహెచ్ఎస్, మసాయిపేట
7. జడ్పీహెచ్ఎస్ బుజ్రంపేట్, కౌడిపల్లి
8. జడ్పీహెచ్ఎస్ ఘనపూర్, తూప్రాన్ మండలం
9. జడ్పీహెచ్ఎస్ గోమారం, శివ్వంపేట మండలం
10. జడ్పీహెచ్ఎస్ కూచన్‌పల్లి, హావేళి ఘనపూర్ మండలం

# ఎప్పుడూ అందుబాటులో ఉంటాం

### మహిళా చట్టాలపై అవగాహనలో షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు

**గజ్వేల్, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**




మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు అన్నారు. ఇవాళ గజ్వేల్ సమీకృత మార్కెట్‌లో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీరాములు మాట్లాడుతూ.. మహిళలకు భద్రత కల్పించే విషయంలో తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. ఎలాంటి సంఘటన జరిగినా పోలీసులను ఆశ్రయించాలన్నారు. తప్పకుండా వారిపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో సంచరించే అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత గ్రామాల్లో మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని.. అలాంటి వారిపై నిఘా పెట్టాలని అవగాహన కార్యక్రమంలో అందరికీ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ లావణ్య, శ్రీనివాస్, మహేష్‌లు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు

## తహసీల్దార్ రజినీకుమారి

**రామాయంపేట, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వరి ధాన్యాన్ని వెంటవెంటనే లారీల్లో రైస్ మిల్లులకు తరలించాలని రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి ఆదేశించారు. తహసీల్దార్ సోమవారం రామాయంపేట పట్టణంతోపాటు డి ధర్మారం తదితర గ్రామాలలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు ధాన్యం మంచి మ్యాచర్ వచ్చేలా వడ్లను ఎండబెట్టాలన్నారు. వడ్లు మంచిగా ఎండితేనే మ్యాచర్ వచ్చి రైతులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు. కేంద్రాల్లో ఉన్న సిబ్బంది ఇక్కడే ఉండి రైతులకు టార్పాలిన్లు, బ్యాగులను అందజేయాలని ఆదేశించారు. బ్యాగులను నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు లారీలలో తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు.